

చదువుకుందాం !
అర్థం చేసుకుందాం !!
ఆచరిద్దాం !!!

DBRC
Dalit Bahujan Resource Centre



# బాలల కోసం

## భారత రాజ్యాంగ ప్రవేశిక



Dalit Bahujan Resource Centre



# ముందుమాట

భారత రాజ్యాంగం ఉదాత్తమైనది మరియు అత్యున్నత విలువలతో కూడినది. ప్రజలు కుల, మత, భాషా, లింగ, ప్రాంత, జాతి మొదలైన తారతమ్యాలు లేకుండా అందరూ సమానమేనని రాజ్యాంగం పునరుద్ఘాటించింది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సమన్యాయం, సమానవకాశాలు, లౌకికవాదం, సమగ్రత మొదలైన అంశాలకు ప్రాధాన్యం ఇవ్వటమే కాకుండా ఆచరించేలా రూపొందించారు. ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు మరియు ఆదేశిక సూత్రాలతో దేశ ప్రజలందరూ ఒక్కటే అని చాటి చెప్పింది భారత రాజ్యాంగం. నేటి బాలల్లో చిన్నప్పటినుంచే రాజ్యాంగ విలువలు పెంపొందించటానికి, ప్రజలంతా ఒక్కటే అనే భావనను కల్పించుటకు, సామాజిక మరియు ఆర్థిక అంతరాలు మనుషులను దూరం చేయకూడదని, వీరిలో సమతా భావనను పెంపొందించుటకు ఈ పుస్తకం తోడ్పడుతుంది.

బాలల్లో రాజ్యాంగ విలువలు మరియు లక్ష్యాలు మీద అవగాహన కల్పించటం వలన వారిని అత్యుత్తమ పౌరులుగా భవిష్యత్తు తరానికి అందించిన వారమవుతాము. నేటి బాలలే రేపటి పౌరులుగా, సమాజంలో అత్యున్నత మనుష్యులుగా జీవించటానికి రాజ్యాంగం మరియు రాజ్యాంగ ప్రవేశిక ఎలా ఉపయోగపడుతుందో అర్థం చేసుకోవాటనికి ఈ పుస్తకం ఎంతగానో దోహదం చేస్తుంది. బాలలందరూ రాజ్యాంగంపై అవగాహన పెంచుకుని, వారి హక్కులను కాపాడుకుంటూ, వారి బాధ్యతలను నెరవేరుస్తూ, సోదరభావంతో జీవిస్తూ, దేశాన్ని అభివృద్ధి పథంలో నడపాలని కోరుకుంటూ ఈ పుస్తకం బాలలందరికీ అంకితం చేస్తున్నాం.

**అల్లడి దేవకుమార్**
ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ
దళిత బహుజన రిసోర్స్ సెంటర్




# భారత రాజ్యాంగ నేపథ్యం

బ్రిటీష్‌వారు రాకపూర్వం భారతదేశాన్ని మౌర్యులు, చోళులు, చాళుక్యులు, విజయనగర రాజులు, శాతవాహనులు, మరాఠాలు, మొఘలులు, తుగ్లఖ్‌లు, మొదలైన బలమైన సామ్రాజ్యాలతోపాటు చిన్న చిన్న రాజ్యాలు మరియు సామంత రాజ్యాలు పాలించాయి. చట్టాలు, పన్నులు, ప్రజల హక్కులు మరియు ఇతర విధివిధానాలలో రాజ్యానికి రాజ్యానికీ మధ్య చాలా తేడాలున్నాయి. భారతదేశానికంటూ ఒక భౌగోళిక స్వరూపం, ఎన్నికల విధానం, ప్రజలంతా ఒక్కటే అనే భావనలు లేవు. రాజులు ఎప్పుడూ రాజ్య విస్తరణ కాంక్షతో ఉండడం వలన, రాజ్యాలు నిరంతరం యుద్ధభూమిని తలపించేవి. రాజ్య పరిపాలనంతా రాజు లేదా రాజ వంశీయుల కనుసన్నల్లో జరిగేది. స్వేచ్ఛ, సమానత్వం, స్వతంత్రత, సమగ్రత, లౌకికవాదం, ప్రజాభిప్రాయం మొదలైన భావాలకు చోటేలేదు.

17వ శతాబ్దంలో బ్రిటీష్‌వారు వ్యాపారవర్తకులుగా వచ్చి దాదాపు 200 సంవత్సరాలు దేశాన్ని పాలించారు. వీరితోపాటు డచ్చి, పోర్చుగీసువారు కూడా కొన్ని ప్రాంతాలను పాలించారు. ఉదాహరణకు గోవా, పాండిచ్చేరి మొదలైన ప్రాంతాలు. బ్రిటీష్‌వారు ప్రవేశపెట్టిన ఆధునిక విద్య, రైలుమార్గం, ఆనకట్టల నిర్మాణం, స్థానిక ప్రభుత్వాలు మొదలైనవి వారి పరిపాలనలో ముఖ్యమైనవి. అధిక పన్నులు, దేశ సంపద తరలింపు, హక్కులు అడిగినవారిని సంవత్సరాలపాటు కఠిన కారాగార శిక్షలు, ప్రశ్నించిన గొంతులకు ఉరితాళ్ళు బిగించేవారు. అంతేకాక, వారికి ఎదురుతిరిగిన వారిని చిత్రహింసలు పెట్టేవారు, దేశ ద్రోహులుగా ముద్రించడం, ఎన్‌కౌంటర్ చేయ్యడం బ్రిటీష్‌వారి పాలనలో చాలా మామూలు విషయాలు. కొన్ని కులాలు, జాతులను Criminal Tribes Act-1871 క్రింద నేరస్థులు అని ముద్రవేసిన ఘనత బ్రిటీష్‌వారికే దక్కింది. అవికాక వారు తీసుకువచ్చిన చట్టాలు, ఎన్నికల విధానం, భారతీయుల అభిప్రాయాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వక పోవటం, నిర్ణయాధికారాలలో భాగం చేయకపోవటం, చట్టాల రూపకల్పనలో భాగం చేయకపోవటంతో విద్యావంతులు, మేధావులు, యువతీ,యువకులు, కార్మికులు మొదలైన వారు బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమాలకు పురుడుపోసి, వారి చట్టాలను వ్యతిరేకించడం ద్వారా స్వాతంత్ర్య ఉద్యమానికి నాంది పలికింది. ఒకచోట మొదలైన ఉద్యమం దావానలంలా అంతటా వ్యాపించింది.

1885లో కాంగ్రెస్ పార్టీ స్థాపించి దాని ద్వారా చాలా ఉద్యమాలు నడిపారు. మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, సుభాష్ చంద్రబోస్, లాలా లజపతిరాయ్, సరోజినీనాయుడు, మొదలైన వారితోపాటు భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, రాజ్‌గురు లాంటి యువకుల ప్రాణ త్యాగాలు ప్రజలలో ఉద్యమ స్ఫూర్తిని నింపాయి. సిపాయిల తిరుబాటు, సహాయ నిరాకరణోద్యమం, ఉప్పు సత్యాగ్రహం, జలియన్ వాలాభాగ్ ఘటన, సైమన్ కమీషన్, క్విట్ ఇండియా ఉద్యమం మొదలైనవి స్వాతంత్ర్య సాధనలో ప్రముఖపాత్ర పోషించాయి. 1947 ఆగష్టు 15న భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. దేశపరిపాలనకు, న్యాయ రక్షణకు, విద్యా, ఉద్యోగాలు, ఎన్నికలు, సంక్షేమ పథకాలు, రక్షణ, ఇతర దేశాలతో సంబంధాలు మొదలైనవాటి నిర్వహణకు, నియమ నిబంధనల ఆవశ్యకతను గుర్తించి డా॥ బి.ఆర్. అంబేద్కర్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగాన్ని రూపొందించుకున్నాము.



1947 ఆగష్టు 15న ఢిల్లీలో ఎర్రకోటపై జెండావందనం చేస్తున్న తొలి భారత ప్రధాని శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ

అనేక సంవత్సరాల పోరాటం తర్వాత ఆగస్టు 15, 1947న భారతదేశం స్వతంత్ర రాజ్యంగా మారింది. అప్పటినుండి భారతదేశ పౌరులుగా దేశ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం అమలుచేయవలసిన ప్రభుత్వ విధి విధానాలను రూపకల్పనలో భాగస్వాములైనాము.




## స్వాతంత్ర్యానంతరం దేశానికి కొన్ని చిహ్నాలను ఏర్పాటు చేసుకున్నాము.



మన జాతీయ పతాకం
**మూడు రంగుల జెండా**
(త్రివర్ణ పతాకం)

జులై 22, 1947న రాజ్యాంగ పరిషత్ జాతీయ జెండాను ఆమోదించింది. జెండాలోని 3 రంగులు ఉన్నాయి. అందులో **కాషాయం** దేశం పట్ల ప్రజల త్యాగాన్ని, ఆత్మస్థైర్యాన్ని ప్రతిబింబిస్తే, మధ్యలోని **తెలుపు** స్వచ్ఛతను మరియు శాంతిని ప్రతిబింబిస్తుంది. **ఆకుపచ్చ** విశ్వసనీయతని, ప్రకృతిని, పాడిపంటల్ని, సంపదను సూచిస్తుంది. మానవ ధర్మాన్ని ప్రబోధించే ఆశోకుడి ధర్మచక్రం నీలిరంగులో నిజాయితీకి ప్రతీకగా నిలుస్తుంది. జాతీయ జెండాను రూపొందించినవారు **పింగళి వెంకయ్య.**



మన జాతీయ జంతువు **పులి**



మన జాతీయ చిహ్నం
**మూడు సింహాలు**



మన జాతీయ పుష్పం
**తామర పువ్వు**



మన జాతీయ పక్షి **నెమలి**

### మన జాతీయ గీతం జనగణమన


భారతదేశ పాలనా వ్యవస్థలు నిర్మించుటకు మరియు వాటి పనితీరుకు, ప్రజల హక్కులు మరియు చట్టాలు చేయుటకు భారత రాజ్యాంగమును రూపొందించి, ఆమోదించుకున్నాము. ఇందుకోసం భారత రాజ్యాంగంలో నియమనిబంధనలను పొందుపరచుకున్నాము. దేశంలోనే భారత రాజ్యాంగం ముఖ్యమైనది మరియు పవిత్రమైనది.

రాజ్యాంగ ప్రవేశిక అనే పరిచయ పీఠికతో భారత రాజ్యాంగం మొదలవుతుంది. రాజ్యాంగ ప్రవేశిక అనేది భారత రాజ్యాంగానికి హృదయం మరియు ఆత్మ వంటిది.

భారత రాజ్యాంగం ఎలా రూపుదిద్దుకుంది, ఎవరు రచించారు, రాజ్యాంగ ప్రవేశికలో ఏమున్నాయి వంటి విషయాల గూరించి ఇప్పుడు తెలుసుకుందాం.

జై భీమ్!

జై భారత్!!



# భారత రాజ్యాంగ ప్రవేశిక

భారత ప్రజలమైన మేము భారత దేశాన్ని,
సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య,
గణతంత్ర, రాజ్యంగా నిర్మించుకోవడానికి

పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని,
ఆలోచనలలోనూ, భావప్రకటనలోనూ, విశ్వాసంలోనూ,
నమ్మకంలోనూ, ఆరాధనలోనూ స్వేచ్ఛనూ

స్థితిగతుల్లోనూ, అవకాశాల్లోనూ,
సమానత్వాన్ని చేకూర్చడానికి,


అందరిలో వ్యక్తి గౌరవాన్ని, జాతీయ సమగ్రతను
సంరక్షిస్తూ, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడానికి
1949, నవంబర్ 26న రాజ్యాంగ పరిషత్‌లో
తీర్మానం చేసుకొని శాసనంగా రూపొందించుకున్న
ఈ రాజ్యాంగాన్ని మాకు మేము
సమర్పించుకుంటున్నాం.



1949వ సం॥లో ఆమోదించుకున్న భారత రాజ్యాంగంలో భారతదేశ పౌరులకు ప్రాథమిక హక్కులు పొందుపరచారు. 1950వ సం॥లో భారతదేశ మొదటి రాష్ట్రపతి, మొదటి ప్రధాని మరియు తదితరులు మొదటి రాజ్యాంగ ప్రతిలో సంతకం చేశారు. భారతదేశ పౌరుల ప్రాథమిక విధులను 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగంలో చేర్చారు. రాజ్యాంగాన్ని, దేశ వ్యవస్థను గౌరవించడం, స్వాతంత్ర్య ఉద్యమ లక్ష్యాలను, స్ఫూర్తిని రక్షించడం, దేశాన్ని రక్షించడం, సోదర భావాన్ని ప్రోత్సహించడం, అడవులు, సరస్సులు, నదులు మరియు వన్యప్రాణులు మొదలైన వనరులను జాగ్రత్తగా కాపాడడం, శాస్త్రీయ దృక్పథాన్ని, మానవతను మరియు పరిశోధనాతత్వాన్ని పెంపొందించడం వంటి బాధ్యతలు భారత రాజ్యాంగంలో నిర్వచించబడ్డాయి.

రాజ్యాంగ ప్రవేశికలో **'సామ్యవాద', 'లౌకిక', 'సమగ్రత'** పదాలను 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగంలో చేర్చారు.


2002 సం॥లో తమ సంరక్షణలో వున్న 6 నుండి 14 సం॥ల లోపు వయస్సు గల బాలలకు విద్యావకాశాలు కల్పించాలి అనే అంశాన్ని ప్రాథమిక విధులలో చేర్చారు.



## భారత రాజ్యాంగం అంటే ఏమిటి?

భారతదేశ ప్రజలందరూ ఇష్టపూర్వకంగా ఒప్పుకొని ఆమోదించుకున్న ఆలోచనలు, నియమాలు, ప్రతిజ్ఞలు మరియు బాధ్యతలన్నింటినీ క్లుప్తంగా వివరస్తూ రచించబడిందే భారతరాజ్యాంగం. పౌరులందరూ అవసరమని భావిస్తే భారత రాజ్యంగంలో కాలానుగుణంగా మార్పులు చేయవచ్చు.


అయితే, భారత రాజ్యాంగం దేశంలోనే ప్రాముఖ్యమైనదిగా ఆమోదించుకున్న చట్టం కనుక భారత రాజ్యాంగంలో మార్పులు చేయడం అంత సులువు కాదు.



1947లో భారతదేశ స్వాతంత్ర్యానంతరం భారత పౌరులకు కావల్సిన హక్కులు, నిర్వహించాల్సిన బాధ్యలతోపాటు పరిపాలనా సౌలభ్యం కోసం ఏర్పాటు చేసుకున్న వ్యవస్థలు, చట్టాలు మరియు ప్రజల జీవనవిధానంకు అనుగుణంగా నిర్మించబడిందే భారత రాజ్యాంగం.


భారత రాజ్యాంగ ప్రవేశికలో ప్రస్తావించిన కొన్ని పదాలు అర్థం చేసుకునేందుకు కొంచె కష్టతరం అయినప్పటికీ, వాటి ఉద్దేశాలు తెలుసుకున్న తరువాత రాజ్యాంగాన్ని రచించినవారు ఎంత కష్టపడి, ఆలోచించి, అర్థవంతంగా వ్రాశారో అనిపిస్తుంది.

భారత రాజ్యాంగం జనవరి 26, 1950 నుంచి అమలులోకి వచ్చింది. అందుకే ప్రతి సంవత్సరము ఆ రోజును మనం గణతంత్ర దినోత్సవంగా (రిపబ్లిక్ డే) గా జరుపుకుంటున్నాము.



## భారతదేశ ప్రజలమైన మేము..


అనేది మన భారతదేశంలోని
పిల్లలతో సహా ప్రజలందరూ అని వివరిస్తుంది.




మేమంతా
సంవత్సరంలో దాదాపు
100కు పైగా పండుగలు
జరుపుకుంటాము

**భారతదేశాన్ని సర్వసత్తాక:** భారత పౌరులుగా దేశాభివృద్ధికి చేయవలసిన పనులను మేము నిర్ణయించుకోగలము, ఇతర దేశాల జోక్యం చేసుకోనవసరం లేదు.

దేశాభివృద్ధికి మనమేమి చేయాలో ఇతరులు మనకి చెప్పాల్సిన అవసరం లేనప్పటికీ, వ్యాపారం, వాణిజ్యాలు నిర్వహించేందుకు దేశాల మధ్య శాంతి సామరస్యాలను పెంపొందించేందుకు మరియు ఇతర పర్యావరణ విపత్తులను ఎదుర్కొనేందుకు పొరుగు దేశాలతో కొన్ని ఒప్పందాలు అవసరం.





**సామ్యవాదం:** దేశ పౌరులందరూ సంపదను సృష్టించడం మరియు వినియోగించుకోవడంలో సమాన భాగస్వాములని అర్థం. దేశ ప్రజలకు సంక్షేమం అందించడంతోపాటు వివక్షతలను నిర్మూలించడం అనేది దేశం యొక్క ప్రధాన బాధ్యత. సామ్యవాదం అనే పదాన్ని రాజ్యాంగ ప్రవేశికలో చేర్చినప్పుడు ఇందిరాగాంధీ భారత ప్రధానిగా ఉన్నారు మరియు ఆమె మాట్లాడుతూ సామ్యవాదమనగా భారతదేశ ప్రజల జీవనాన్ని మెరుగుపరచడం అన్నారు.






**లౌకిక:** భారతదేశం వివిధ మతాలు, భాషలు మరియు నమ్మకాలు కలిగిన కోట్లమంది ప్రజల సమూహం. భారతదేశంలో ప్రతిఒక్కరూ తమకు నచ్చిన మతాన్ని అనుసరించేందుకు, తమ నమ్మకాలను కొనసాగించేందుకు హక్కును కలిగి ఉన్నారు. కావున, దేశ ప్రజలందరూ ఇతర మతాలను, నమ్మకాలను మరియు విశ్వాసాలను గౌరవించాలి. అంతేకాక, ప్రభుత్వం కూడా ఒక మతానికి చెందిన వారిపై ఇతర మతాల విశ్వాసాలను రుద్దకూడదు అని తెలియజేసేదే లౌకికవాదం.






**హిందూమతం:**
భారతదేశంలో 80% పైగా ప్రజలు అనుసరిస్తున్న మతవిశ్వాసం

**క్రైస్తవ్యం:**
2000 సం॥ల క్రితం భారతదేశానికి వచ్చింది

**ఇస్లాం:**
గత వెయ్యి సం॥లుగా భారతదేశంలోని కొంతమంది ప్రజలు అనుసరిస్తున్న మత విశ్వాసం.

**బుద్ధిజం**
2,500 సం॥ల క్రితం భారత దేశంలో సిద్దార్ధ గౌతమునిచే స్థాపించబడిన విశ్వాసము.

సిక్కిజం, జైనిజం వంటివి భారతదేశంలోనే పుట్టిన / మొదలయిన మత విశ్వాసాలు. వీటిలో బుద్ధిజం భారతదేశం నుండి అనేక ఇతర దేశాలకు వ్యాపించింది.

**ప్రజాస్వామ్య:** ఎటువంటి రాచరిక (రాజు, రాణి) ప్రభుత్వానికి చోటు లేకుండా ప్రజలచేత, ప్రజల కొరకు ఏర్పాటు చేసుకున్న ప్రజల ప్రభుత్వం అని అర్థం.

## మన దేశంలోని చట్టాలను ఎవరు చేస్తారు? మన ప్రభుత్వాన్ని ఎవరు నడిపిస్తారు?

మన దేశంలో 18 సం॥లు నిండిన ప్రతి ఒక్క పౌరునికి ఓటు హక్కు ఉంది. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో తమకు నచ్చిన వ్యక్తికి ఓటు వేయడం ద్వారా శాసన సభ్యులను, లోక్‌సభ సభ్యులను ఎన్నుకుంటారు. ప్రత్యక్ష ఎన్నికల ద్వారా లోక్‌సభకు 543 మందిని, రాజ్యసభకు 233 మందిని ఎలక్ట్రోరల్ కాలేజ్ ద్వారా వివిధ రాష్ట్ర శాసన సభ్యులు ఎన్నుకుంటారు. లోక్‌సభ మరియు రాజ్యసభను కలిపి పార్లమెంట్ అని పిలుస్తారు. వీరుకాక పరోక్ష పద్ధతిన మరో 14 మందిని పార్లమెంట్‌కు రాష్ట్రపతి నియమిస్తారు. మొత్తంగా లోక్‌సభ, రాజ్యసభలోని 790 మంది సభ్యులు మరియు దేశ రాష్ట్రపతి అందరూ కలిసి పార్లమెంట్‌లో చర్చించి దేశంలో ఏయే చట్టాలు ఉండాలనేది నిర్ణయిస్తారు. చట్టాలన్నీ కూడా రాజ్యాంగం పరిధిలోనే ఉంటాయి. చట్టంలోని నిబంధనల ప్రకారం ప్రభుత్వ పనితీరు ఉంటుంది. రాజ్యాంగం మరియు చట్టాల ప్రకారం ప్రభుత్వం పనిచేస్తుంది.






## గణతంత్రం:

'గణం' అనగా ప్రజలు, 'తంత్రం' అనగా పాలన. అంటే ప్రజలుచే ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా నిర్ణీత కాలానికి పాలకులను ఎన్నుకునే ప్రభుత్వం. ఇందులో వారసత్వ అధికారాలకు తావులేదు.

## పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయం:

దేశంలోని పౌరులందరినీ అన్ని విషయాలలో సమానంగా చూస్తూ, అన్నింటిలో సమన్యాయాన్ని అందించాలి. అనగా

1) కుల, మత, జాతి, లింగ వివక్షతలు లేకుండా దేశంలోని పౌరులందరూ సమానమే.

2) పౌరులందరికీ సమాన అవకాశాలు కల్పించాలి.

3) ఒక వ్యక్తి- ఒక ఓటు - ఒకే విలువ.

ఓటు హక్కు ద్వారా స్వేచ్ఛగా నాయకులను ఎన్నుకోవడం (లేదా) ఎన్నికలలో పోటీ చేయడం.




## ఆలోచనలలోనూ, భావ ప్రకటనలోనూ, విశ్వాసంలోనూ, నమ్మకంలోనూ, ఆరాధనలోనూ భారత పౌరులు పూర్తి స్వేచ్ఛ కలిగివున్నారు.

ఇతరులకు హాని జరగనంతవరకూ పౌరులందరికీ తమ ఆలోచనలను తెలియజేసేందుకు, తమకు నచ్చినచోట జీవించేందుకు, నచ్చిన స్నేహితులను ఎన్నుకునేందుకు, తమకు ఇష్టమైన మతాన్ని అనుసరించేందుకు, నమ్మకాలను కొనసాగించేందుకు హక్కు ఉంది.



**స్థితిగతుల్లోనూ, అవకాశాల్లోనూ సమానత్వాన్ని చేకూర్చడం:** దేశంలోని పౌరుల ందరూ జాతి, కుల, మత, లింగ, ప్రాంత, వివక్షత లేకుండా చట్టం ముందు అందరూ సమానమే. ప్రతి ఒక్కరూ తమ జీవనాన్ని అభివృద్ధి చేసుకునేందుకు పౌరులందరికీ సమాన అవకాశాలు రాజ్యాంగం కల్పించింది.




## అందరిలో వ్యక్తి గౌరవాన్ని, జాతీయ సమగ్రతను సంరక్షిస్తూ, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడానికి:

భారత రాజ్యాంగం దేశంలోని భిన్న మతాలు, భాషలు, కులాలు, విశ్వాసాలు మరియు సంస్కృతులకు అతీతంగా పౌరులందరిలో సోదరభావాన్ని నింపుతూ ఉమ్మడి కుటుంబ భావనను ప్రోత్సహిస్తుంది. భారతదేశం అన్ని విషయాలలో ఇతర దేశాల కంటే ధృఢంగా ఉండేందుకు “భిన్నత్వంలో ఏకత్వం” ప్రధానపాత్ర పోషిస్తుంది.

## 1949, నవంబర్26న రాజ్యాంగ పరిషత్‌తో తీర్మానం చేసుకొని శాసనంగా రూపొందించుకున్న ఈ రాజ్యాంగాన్ని మాకు మేము సమర్పించుకుంటున్నాం.

ఇప్పటి వరకూ రాజ్యాంగ ప్రవేశికను గూర్చి తెలుసుకున్నాం. ఇప్పుడు రాజ్యాంగాన్ని ఎవరెవరు రచించారు? ఏవిధంగా రచించారు? అనే విషయాలు తెలుసుకుందాం.

భారతదేశానికి స్వాతంత్ర్యం రావడానికి ఎనిమిది నెలల ముందు అనగా డిసెంబర్ 9,1946న భారతదేశ స్వతంత్ర పోరాటంలో ప్రముఖపాత్ర పోషిస్తున్నవారు ఢిల్లీలో సమావేశమై స్వాతంత్ర్యానంతరం భారతదేశ విధివిధానాలు ఏవిధంగా ఉండాలి, ఎలాంటి చట్టాలు, నియమనిబంధనలు అవసరమనే విషయాలను చర్చించారు. పాల్గొన్నవారంతా తమ ఆలోచనలను, భావనలను వివరించిన తరువాత భారత రాజ్యాంగాన్ని వ్రాతపూర్వకంగా రచించేందుకు 299 మంది సభ్యులతో రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పాటు చేసుకున్నారు.

రాజ్యాంగ రచనా కమిటీకి డా॥ బి.ఆర్. అంబేద్కర్ నాయకత్వం వహించారు. భారత దేశంలోని వివిధ మతాల ం, కులాలు, భాషలు, సంస్కృతులకు చెందిన కోట్లమంది ఆలోచనల్ని మరియు ఆకాంక్షలకు అనుగుణంగా భారత రాజ్యాంగాన్ని 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులలో పూర్తిచేశారు. భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగం.

1949 నవంబర్ 26న రాజ్యాంగ పరిషత్ అధ్యక్షుడు డా॥ బాబురాజేంద్రప్రసాద్‌కి రాజ్యాంగ రచనా కమిటీ అధ్యక్షుడు డా॥ బి.ఆర్. అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని సమర్పించారు. జనవరి 26, 1950 నుంచి భారతదేశంలో రాజ్యాంగం అమలులోకి వచ్చింది.



డా॥ బాబురాజేంద్రప్రసాద్‌కి భారత రాజ్యాంగ ప్రతిని సమర్పిస్తున్న డా॥ బి.ఆర్. అంబేద్కర్

# ప్రతిజ్ఞ


భారతదేశ పిల్లలమైన మేము భారతదేశాన్ని సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా నిర్మించుకోవడానికి పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ **న్యాయాన్ని** ఆలోచనలలోనూ, భావ ప్రకటనలోనూ, నమ్మకములోనూ, విశ్వాసంలోనూ **స్వేచ్ఛనూ,** అవకాశాల్లోనూ మరియు స్థితిగతుల్లోనూ **సమానత్వాన్ని** అందిస్తూ అందరిలో **సోదరభావం, వ్యక్తి గౌరవం** ప్రోత్సహిస్తూ భారతీయులందరి జీవనాన్ని మెరుగుపరచే దృఢమైన **స్వతంత్ర ప్రజాస్వామ్య** రాజ్యంగా నిర్మించుకునేందుకు ఈ రాజ్యాంగాన్ని మాకు మేము సమర్పించుకుంటున్నాము.



# పిల్లలుగా మనం చేయవలసిన పనులు ఏమిటి?

భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 73 సం॥లు అయ్యింది. అయితే రాజ్యాంగంలో మనం పొందుపరచుకున్న అనేక చట్టాలు, నియమనిబంధనల అమలుకు మనమందరము కృషి చేయాల్సిన ఆవశ్యకత ఉంది.

భారత రాజ్యాంగం ప్రకారం భారతదేశంలో ప్రతి ఒక్క బాలుడు, బాలికకు సమయానికి సరైన భోజనం, ఆరోగ్యం మరియు విద్య పొందే హక్కులు ఉన్నాయి. అయినప్పటికీ ఎంతోమంది చిన్నారులు నేటికీ ఆకలితో పేదరికంలో అలమటిస్తున్నారు. ఎంతోమంది పిల్లలు అనారోగ్యంతో బాధపడుతున్నారు. చాలామంది పిల్లలకు చదవడం, వ్రాయడం తెలియదు. కొంతమంది బలవంతంగా బాల కార్మికులుగా మారుతున్నారు. మనచుట్టూ ఉన్న ఎంతోమంది అక్కాచెల్లెలు, అన్నాతమ్ముళ్ళు సరైన జీవనం లేక ఇబ్బంది పడుతున్నప్పుడు సమానత్వం లేనట్టే. కాబట్టి మనమందరం మన తోటి సోదరుల జీవనాన్ని మెరుగుపరచేందుకు సహకరించాలి, కృషి చేయాలి. ప్రతి ఒక్కరూ తోటివారితో దయకలిగి, నమ్మకంగా ఎటువంటి పరిస్థితుల్లో సైతం ధైర్యంగా ఉండాలి. మనం ఇతరుల నుండి ఎటువంటి మార్పు కోరుకుంటామో ముందుగా ఆ మార్పు మనలో మొదలవ్వాలి.




మనమందరం సోదర భావంతో ఒకరికొకరు సహాయం చేసుకుంటూ, ప్రోత్సహిస్తూ, మనం ఉంటున్న ప్రదేశాలను, మనకున్న వనరులైన అడవులు, నదులు, సరస్సులు, వన్యప్రాణులన్నింటినీ కాపాడుకుంటూ శాంతియుతమైన, సంతోషకరమైన జీవనాన్ని గడపాలి. అప్పుడే మనందరం "భారతదేశం నా దేశం" అని ధైర్యంగా, గర్వంగా చెప్పగలము.

DBRC
Dalit Bahujan Resource Centre



1947 ఆగష్టు 29న **డా॥ బాబూ రాజేంద్రప్రసాద్** అధ్యక్షతన సమావేశమైన రాజ్యాంగ పరిషత్ అప్పటి **న్యాయ శాఖా మంత్రి వర్యులు డా॥బి.ఆర్. అంబేడ్కర్** సారధ్యంలో 7గురు సభ్యులతో స్వతంత్ర భారతదేశానికి రాజ్యాంగ రచనా కమిటీని ఏర్పాటు చేసింది.


## రాజ్యాంగ రచనా కమిటీ

అధ్యక్షులు

## డా॥ బి.ఆర్. అంబేడ్కర్

సభ్యులు :

(1) శ్రీ ఎన్.గోపాలస్వామి అయ్యంగార్
(2) శ్రీ అల్లాడి కృష్ణస్వామి అయ్యర్
(3) శ్రీ కె.ఎం.మున్షీ
(4) శ్రీ సయ్యద్ మహమ్మద్ సాదుల్లా
(5) శ్రీ ఎన్.మాధవరావు
(6) శ్రీ డి.పి.ఖైతాన్
(7) శ్రీ టి.టి. కృష్ణమాచారి






# డా॥ భీంరావ్ రామ్‌జీ అంబేడ్కర్

డా॥భీంరావ్ రామ్‌జీ అంబేడ్కర్ ఏప్రిల్ 14,1891న మధ్యప్రదేశ్‌లోని "మౌ" పట్టణంలో దళిత కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి బ్రిటీష్ ఆర్మీ ఆఫీసర్‌గా పనిచేశారు. అంబేడ్కర్ తన తల్లిదండ్రులకు 14వ మరియు చివరి సంతానం. దళిత కుటుంబం నుండి వచ్చిన అంబేడ్కర్‌ను అంటరానివానిగా పరిగణించి ఇతర పిల్లలతోపాటు తరగతి గదిలో కూర్చోనివ్వలేదు. అందుకని తరగతి బయటే కూర్చుని చదువుకున్నారు. టీచర్లు తక్కువ కులాలకు చెందిన పిల్లలకు పాఠాలు నేర్చుకోవడంలో సహాయం చేసేవారు కాదు. పాఠశాలలో మంచినీరు త్రాగేందుకు వెళ్ళినప్పుడు అంటరానితనం ముసుగులో కనీసం గ్లాసు కూడా ముట్టుకోనివ్వలేదు. ఉన్నత కులాలకు చెందిన పిల్లలు గ్లాసుతో నీరు తీసిపోస్తే తక్కువ కులాలకు చెందిన పిల్లలు చేతిగుప్పెట్లతో త్రాగేవారు. అవమానాలు, అంటరానితనం, చీత్కరింపులు, పేదరికం, అసమానతలు ఎదుర్కొంటూనే గ్రాడ్యుయేషన్ వరకు చదువును పూర్తిచేసి, అమెరికా, ఇంగ్లాండ్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ మరియు పిహెచ్‌డి పూర్తిచేశారు. అడుగడుగునా అంటరానితనం, వివక్షను ఎదుర్కొన్న అంబేడ్కర్, సమాజంలో అన్నిరకాల అసమానతలను నిర్మూలించి, అణగారిన వర్గాలను విముక్తి చేసేందుకు పోరాటం చేశారు.

అంబేడ్కర్ అంచెలంచెలుగా గౌరవింపబడుతూ మొదటి అడుగుగా స్వతంత్ర భారత తొలి న్యాయశాఖా మంత్రిగా రాజ్యాంగ పరిషత్ సభ్యునిగా, మరియు రాజ్యాంగ రచనా కమిటీ అధ్యక్షునిగా పనిచేశారు. ఆయన ఒక గొప్ప న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, రాజనీతిజ్ఞుడిగా, ప్రజల నేతగా, ఒక గొప్ప జర్నలిస్ట్‌గా మరియు ప్రజాస్వామ్య దార్శనికునిగా ప్రఖ్యాతిపొందారు. దీనికి ప్రధానకారణం అంబేడ్కర్‌కున్న లోతైన విస్తారమైన అధ్యయనం, అపారమైన పరిజ్ఞానం, ఆంగ్లభాషలో అద్భుతమైన ప్రావీణ్యం, ఒక విషయాన్ని వివరించటంలో నైపుణ్యం మరియు ఆదర్శవంతమైన దేశభక్తి ఆయన సొంతం. ప్రజలందరి అభివృద్ధికి సమానత్వం, సోదరభావం, సౌభ్రాతృత్వం అవసరమని ఆయన ధృడంగా నమ్మారు. డిసెంబర్ 6, 1956న డా॥బి.ఆర్.అంబేడ్కర్ గారు మహాపరినిర్యాణం పొందారు.

THIS BOOK
NOT FOR SALE

*jmjgraphics@9494046530

DBRC
Dalit Bahujan Resource Centre

## దళిత బహుజన రిసోర్స్ సెంటర్

డోర్ నెం.4-16-25/6, బండ్లమూడి కాంప్లెక్స్, 4వలైను, భారత్‌పేట
అమరావతిరోడ్, గుంటూరు-2., ఆంధ్రప్రదేశ్, ఫోన్ : 0863-2254271, 7286045555
E-mail : apdbrc@gmail.com I Web Site : www.dbrcindia.org